క్లుప్తంగా

కుంభం శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే సన్మానం



డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: నల్లగొండ డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన కుంభం శ్రీనివాస్‌రెడ్డిని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపేందుకు బుధవారం హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని రాజగోపాల్‌రెడ్డిని పూలమాల, శాలువాలతో సన్మానించారు.

కొబ్బరికాయల వేలంపాట

చిట్యాల: వెలిమినేడు గ్రామ పరిధిలో గల శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో కొబ్బరి కాయలు, పూజా సామగ్రి, లడ్డు, పులిహోర ప్రసాదం అమ్ముకునేందుకు బుధవారం ఆలయ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. వీటిని భువనగిరికి చెందిన బచ్చు బాలప్రభు ఏడు లక్షల పదకొండు వేల రూపాయలకు దక్కించుకున్నారు. ఈ వేలం పాట ద్వారా ఆలయానికి గత ఏడాది కంటే ఇరవై వేల రూపాయలు తక్కువగా ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ పరిశీలకురాలు వెంకటలక్ష్మీ, ఆలయ మేనేజర్ నాగిరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాధ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

చండూరు : పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ చండూరు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. మూడు నెలలకు సంబంధించిన వేతనాలు అందించాలని కోరుతూ మూడు రోజుల క్రితం కార్మికులు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించి ప్రతి నెల సమయానికి వేతనాలు చెల్లిస్తామని అధికారుల హామీ ఇస్తేనే సమ్మె విరమిస్తామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునుగోడు: అనారోగ్యం కారణంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాగర్ల లింగస్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, పాల్వాయి జితేందర్ రెడ్డి, ఎండీ అన్వర్, పవన్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం

మునుగోడు: రేషన్ దుకాణాల ద్వారా అందించే నిత్యావసర సరుకులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.నరేందర్ కోరారు. గుండ్లోరిగూడెం, చల్మెడ గ్రామాల్లో బుధవారం నూతన రేషన్ దుకాణాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దూర ప్రాంతాలకు వెళ్లి ప్రజలు రేషన్ సరుకులు తీసుకొచ్చుకునే బాధలు లేకుండా మునుగోడు మండలంలో నాలుగు నూతన దుకాణాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నారబోయిన రవి, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, జంగిలి నాగరాజు పాల్గొన్నారు.

నేడు చిట్యాలలో ప్రజావాణి

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డుల్లో గురువారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చిట్యాల మున్సిపల్ కమిషనర్ వీరేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా వార్డుల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా వార్డుల్లోని ప్రజలు తమ సమస్యలపై ప్రజావాణిలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

బాలికలకు ఆరోగ్యంపై అవగాహన

నల్లగొండ: పట్టణంలోని గీతాంజలి జూనియర్ కళాశాలలో బుధవారం బాలికలకు మ్యాన్‌కైండ్ ఫార్మ ఆధ్వర్యంలో హెల్త్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ రాజేశ్వరి హాజరై కౌమార దశలో బాలికలకు వచ్చే ఆరోగ్య సమస్యలపై వివరించారు. ముఖ్యంగా రక్తహీనత, రుతుక్రమం, గర్భసంచి క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, టీకాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చింతరెడ్డి మల్లారెడ్డి, ఇతర వైద్యులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజేశ్వరి

ఐదు సెంటీమీటర్లకు మించని వర్షపాతం

- అంతంత మాత్రంగానే పోస్తున్న బోర్లు
- చెరువులు నిండకపోవడంతో ఆందోళనలో వరి రైతులు



వట్టిపోయిన సోలిపురం గాంధీసాగర్ చెరువు

మునుగోడు : ఈ వానాకాలం సీజన్‌లో మునుగోడు మండలంలో ఇప్పటివరకు భారీ వర్షాలు కురవనే లేదు. చెరువులు కుంటల్లోకి నీరు చేరుకోలేదు. బోర్లు అంతంత మాత్రంగానే పోస్తున్నాయి. జూన్ 3వ తేదీ నుంచి మునుగోడు మండలంలో అడపాదడపా వర్షం కురుస్తోంది. మొదటి రోజు కేవలం 2.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా మిగిలిన రోజుల్లో 2 సెంటీమీటర్ల లోపు నమోదయింది. జూన్ 23వ తేదీన మాత్రమే కాస్త అధికంగా కురిసి 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. గతంలో ఈ సమయానికి ఒకటి, రెండుమార్లయినా కనీసం 11 నుంచి 14 సెంటీమీటర్ల వర్షం కురిసేది. అలా కురిసినప్పుడు మునుగోడు పెద్ద వాగు పారడంతోపాటు పలు చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరేది. ఇప్పటివరకు కురిసిన వర్షం అంతా భూమిలో ఇంకిపోయిందే తప్ప కనీసం చిన్నపాటి కుంటలు కూడా నిండలేదు. ఈ వర్షం కారణంగా రైతన్నలు సాగుచేసిన మెట్ట పంటలకు మంచి మేలు కలిగింది. అయితే వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లనుందని రైతులు వాపోతున్నారు. గతంలో ఎప్పుడు వర్షాలు కురిసినా జూన్ మొదటివారంలో కనీసం సగం గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరేది. కానీ ఈ ఏడాది జూన్ మాసం ప్రారంభంలో కేవలం ముసురు వర్షం కురవడంతో చుక్క నీరు కూడా కాల్వల ద్వారా పారలేదు.

అంతంత మాత్రంగానే పోస్తున్న బోర్లు

మునుగోడు మండలంలోని 26 గ్రామాల్లో 112 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో 10 చెరువులు పెద్దవి కాగా 102 చెరువులు చిన్నవి. అయితే గత ఏడాది సరిగ్గా వర్షాలు కురవకపోవడంతో చెరువులు సగం వరకు నిండి వేసవికాలం వచ్చే సరికి పూర్తిగా ఎండిపోయాయి. ప్రస్తుతం కొన్ని చెరువులు, కుంటల్లో మాత్రం ముసురు ద్వారా అదే చెరువుల్లో పారిన నీరు గుంతల్లో నిల్వ ఉంది. ప్రధానంగా మునుగోడు, సోలిపురం, కిష్టాపురం, చీకటిమామిడి, పులిపలుపుల, కొంపల్లి, కొరటికల్, కల్వలపల్లి తదితర గ్రామాల్లోని పెద్ద చెరువుల్లో చుక్క నీరు నిల్వ లేదు. దీంతో వ్యవసాయ మోటార్లు అంతంత మాత్రంగా నీరుపోస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటితే వరిసాగుకు పెట్టిన పెట్టుబడులు వృథా అవుతాయని మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు.



చుక్క నీరు లేక వెలవెలబోతున్న మునుగోడు పెద్దవాగులోని చెక్ డ్యామ్

పెద్ద చెరువుల్లో చుక్క నీరు లేదు

ఈ ఏడాది భారీ వర్షాలు కురవకపోవడంతో ఏ ఒక్క పెద్ద చెరువులో చుక్క నీరు లేదు. గత ఏడాది వచ్చిన నీరు కూడా వేసవికాలంలో పూర్తిగా ఎండిపోయింది. భారీ వర్షాలు కురవని కారణంగా ఎక్కడా కాల్వలు, వాగు పారలేదు. దీంతో అనేక చెరువుల్లో నీరు లేకుండా పోయింది.

–ప్రేమ్‌కుమార్, ఐబీ, డీఈ

ప్రతి ఏడాది జూన్ మాసంలోనే నిండేది



మా గ్రామంలోని నడిమికుంట ప్రతి ఏటా జూన్ మాసంలోనే నిండేది. కానీ ఈ ఏడాది ఇప్పటివరకు కనీసం సగం కూడా నిండలేదు. దీనికి ప్రధాన కారణంగా ఈ ఏడాది ఒకమారు కూడా భారీ వర్షం కురవలేదు. ఒక భారీ వర్షం కురిసినా పెద్ద వాగు పారి పలివెల ఫీడర్ చానల్ ద్వారా మా చెరువులోకి నీరు వచ్చి చేరేది.

–జక్కలి శ్రీను, జక్కలివారిగూడెం

చకిలం శ్రీనివాసరావుకు ఘన నివాళి



చకిలం విగ్రహానికి పూలమాల వేస్తున్న శంకర్‌నాయక్, గుమ్మల మోహన్‌రెడ్డి, తదితరులు

నల్లగొండ: బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచిన మహనీయుడు చకిలం శ్రీనివాసరావు అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. మాజీ ఎంపీ చకిలం శ్రీనివాసరావు వర్ధంతి సందర్భంగా నల్లగొండలో బుధవారం చకిలం విగ్రహానికి శంకర్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా నిర్మించే కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి శ్రీనివాసరావు భవన్ అని పేరు పెడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చకిలం అనిల్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కత్తుల కోటి, సుభాష్, జూలకంటి సైదిరెడ్డి, పోలె జయకుమార్, గాలి నాగరాజు, గాలి రవి, మామిడి కార్తీక్, పాదం అనిల్, కంచర్ల ఆనంద్‌రెడ్డి, దాసరి శంకర్, దాసరి విజయ్, చింతపల్లి గోపాల్, మనిమద్దె సాయి పాల్గొన్నారు.

ఎంపీటీసీ పదవి కంటే వార్డు సభ్యులు మేలు



మాట్లాడుతున్న ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి

నార్కట్‌పల్లి : ఎంపీటీసీ పదవి కంటే గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ పదవి ఎంతో మేలని మండలంలోని పలువురు ఎంపీటీసీలు అన్నారు. ఎంపీటీసీల వీడ్కోలు సమావేశంలో బుధవారం ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు మాట్లాడుతూ గతంలో ఎంపీటీసీలకు మండల పరిషత్ నిధులు ప్రత్యేకంగా ఉండేవన్నారు. ఆ నిధులతో అభివృద్ధి పనులను చేసేవారమన్నారు. ప్రస్తుతం ఎంపీటీసీలకు ఎలాంటి నిధులు లేకపోవడంతో తమ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండానే పదవి పూర్తి చేసుకున్నామని వాపోయారు. గ్రామ పంచాయతీ వార్డు మెంబర్‌కు ఉన్న ప్రత్యేక నిధులు ఎంపీటీసీలకు లేకపోవడం విచారకరమన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఎంపీటీసీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, మేకల రాజిరెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సైదులు, ఉంద్ర భాగ్యమ్మ, చిరుమర్తి యాదయ్య, పుల్లెంల ముత్తయ్య, అంజయ్య, పావని, సౌమ్య, లక్ష్మమ్మ, జయలక్ష్మి, కనకమ్మ, దేవకమ్మ, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

అరకొర వసతులతో అవస్థలు



నకిరేకల్‌లోని వడ్డెర కాలనీ



గుడిసెల్లో నివసిస్తున్న కాలనీవాసులు

- దుర్భరంగా వడ్డెర కాలనీ వాసుల జీవనం
- గుడిసెల్లోనే నివాసం
- కనీస సౌకర్యాలు కరువు
- పక్కా ఇళ్ల కోసం ఎదురుచూపులు

నకిరేకల్ : రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు అవి. పనికి వెళితే వచ్చిన డబ్బులతో నాలుగు మెతుకులు తింటూ కనీస సౌకర్యాలు లేక అలమటిస్తున్నారు వారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని ఒకటోవార్డు మార్కెట్ రోడ్డులో ఉన్న వడ్డెర కాలనీలో ప్రజల పరిస్థితి దుర్భరంగా ఉంది. ఈ కాలనీలో సుమారు 50 కుటుంబాలపైనే నివాసం ఉంటున్నారు. మొత్తం 150 మంది వరకు జనాభా ఉన్నారు. వీరందరు కూడా గుడిసెలు వేసుకుని అరకొర వసతుల మధ్య జీవనం సాగిస్తున్నారు. మూడు దశాబ్దాల నుంచి గుడిసెల్లోనే జీవనం సాగిస్తూ బతుకు జీవుడా అంటూ కాలం వెల్లదీస్తున్నారు. వీరందరికీ సొంత ఇంటి స్థలాలు లేకపోవడంతో ఇతరుల భూముల్లో గుడిసెలు వేసుకుని దుర్భర జీవనం గడుపుతున్నారు. వర్షాకాలంలో గుడిసెల్లోకి వర్షపునీరుతోపాటు విష సర్పాలు కూడా వస్తున్నాయి. ఈ కాలనీల్లో డ్రెయినేజీ, సీసీ రోడ్లు లేవు. కనీసం విద్యుత్ కనెక్షన్ కూడా తీసుకునే స్థితిలో ఆ కుటుంబాలు లేవు.

ప్రతిపాదనలు పంపాం



వడ్డెర కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాం. ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. ఈ కాలనీలో అందరు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రాధాన్యత ఇచ్చేలా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా.

–కందాల భిక్షంరెడ్డి, 1వ వార్డు కౌన్సిలర్

రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ మురళి

శాలిగౌరారం: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలు రూపొందించాలని పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి అన్నారు. రైతు భరోసా పథకం అమలుపై మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో బుధవారం రైతుల అభిప్రాయ సేకరణ కోసం సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పథకం అమలుపై రైతులు భిన్నాభిప్రాయాలు, సలహాలు, సూచనలను వెల్లడించారన్నారు. రైతులందరికీ వర్తింపజేయాలని కొందరు, ఐదెకరాల వరకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని కొంతమంది కోరారన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసా అమలు చేయాలని మరికొందరు రైతులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పేర్కొన్నారు. అదే విధంగా రైతు రుణమాఫీని ఎలాంటి కటాఫ్ తేదీ లేకుండా రైతులందరికీ వర్తింపజేయాలని రైతులు సూచించారు. ఈ సమావేశంలో నకిరేకల్ ఏడీఏ రామారావునాయక్, మండల వ్యవసాయ అధికారి సౌమ్యశృతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, సంఘం డైరెక్టర్లు, సంఘం సీఈఓ నిమ్మల ఆంజనేయులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా కంభంపాటి భూపాల్

మునుగోడు: బీజేపీ కిసాన్ మోర్చా మునుగోడు మండల అధ్యక్షుడిగా కంభంపాటి భూపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షులుగా పుల్కరం నర్సింహ, నకరెకంటి క్షేత్రయ్య, వనం రవి, నాతి నర్సింహ, ప్రధాన కార్యదర్శులుగా కొండ మల్లేష్, జిట్టగోని చంద్రమోహన్, కార్యదర్శులుగా దోటి సాయికుమార్, సంకు యాదగిరి, సింగం సైదులు, సోమగోని శ్రీను, కోశాధికారిగా బత్తుల వెంకన్న, సోషల్ మీడియా కన్వీనర్‌గా జక్కలి రాకేష్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీసభ్యులు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

దళిత మోర్చా అధ్యక్షుడిగా యాదయ్య

బీజేపీ దళిత మోర్చా మునుగోడు మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పందుల యాదయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బుడిగపాక రవి, పెరమాళ్ల శ్రీరామ్, అద్దంకి సైదులు, గాదె హుసేన్, ప్రధాన కార్యదర్శులుగా పందుల సురేష్, వడ్డెపల్లి శంకర్, కార్యదర్శులుగా బొంతల కృష్ణయ్య, దొడ్డి నర్సింహ, బొల్గూరి గిరి, స్వామి, కోశాధికారిగా దోర గణేశ్‌ను ఎన్నుకున్నారు.

ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నకిరేకల్ : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నకిరేకల్‌లోని సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్ననీటి కాల్వల కోసం రాబోయే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, కందాల ప్రమీల, బొజ్జ చిన వెంకులు, రాచకొండ వెంకట్‌గౌడ్, బుచ్చిరాములు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉట్ల స్తంభాల నిర్మాణానికి ప్రతిష్ఠాపన

నాంపల్లి : మండల కేంద్రంలోని శ్రీ రాధారుక్మిణి వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉట్ల స్తంభాల నిర్మాణానికి బుధవారం పూజలు నిర్వహించారు. అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కోలాటం బృందానికి చేయూత

నాంపల్లి : మండల కేంద్రంలోని ముదిరాజు కాలనీకి చెందిన పలువురు మహిళలు కోలాటం నేర్చుకునేందుకు పలువురు బుధవారం ఆర్థికసాయం అందజేశారు. కర్నాటి విద్యాసాగర్ రూ.24 వేలు, గజ్జల శివారెడ్డి రూ.20 వేలు, పూల వెంకటయ్య రూ.17 వేలు, కుంభం చరణ్‌కుమార్‌రెడ్డి రూ.17 వేలు, పానగంటి వెంకన్నగౌడ్ రూ.15 వేలతోపాటు మరికొందరు ఆర్థికసాయం అందజేశారు.

నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు అందజేస్తున్న పాశం రాంరెడ్డి

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం మర్రిగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ అందించడానికి సహకరించిన అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో మైల అశోక్‌రెడ్డి, పోకల సతీష్, జాకటి మోష పాల్గొన్నారు.

పదవితో సంబంధం లేకుండా ప్రజాసేవ చేయాలి



తిప్పర్తిలో సన్మానం పొందిన ప్రజాప్రతినిధులు

రామగిరి(నల్లగొండ): పదవితో సంబంధం లేకుండా ప్రజాసేవ చేసిన వారే మంచి నాయకులు అవుతారని తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. బుధవారం తిప్పర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ మాట్లాడుతూ పదవీ కాలం ముగిసినా నిత్యం ప్రజలతోనే ఉంటామని తెలిపారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తున్నందున వారిని సన్మానించారు. మండల ప్రత్యేక అధికారి ఈఈ భూమన్న, ఎంపీడీఓ ఎ. వెంకటేశ్వర్ రెడ్డి, నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ ముత్తినేని శ్యాంసుందర్, ఎంపీటీసీలు బత్తిని మట్టయ్య, ముత్తినేని అనూష నాగేశ్వర్‌రావు, కొత్తపల్లి సిరివెన్నెల ఈదయ్య, రమాదేవి, సందీప్, పల్లె ఎల్లయ్య, అధికారులు పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీపీ, ఎంపీటీసీలకు ఘనంగా వీడ్కోలు

శాలిగౌరారం: ఎంపీటీసీల పదవీకాలం గురువారం ముగియనుండడంతో శాలిగౌరారం మండలంలోని 13 మంది ఎంపీటీసీలకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీలు గ్రామాభివృద్ధికి ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి, ఎదుర్కొన్న ఒడిదుడుకులు, ప్రజలకు చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకొని కంటనీరు తెచ్చుకున్నారు. తమ ఐదేళ్ల పాలన సజావుగా సాగిందని, ప్రజలు, వివిధ శాఖల అధికారుల సహకారాన్ని ఎప్పటికీ మరువలేమని ఎంపీటీసీలు వివరించారు. అనంతరం ఎంపీటీసీలను జెడ్పీటీసీ ఎర్రరణీల, మండల అధికారులు, నాయకులు పూలమాలలు, శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సుందరయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలన అందించడమే కాంగ్రెస్ లక్ష్యం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నార్కట్‌పల్లి : ఎంపీపీ, ఎంపీటీసీలతో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి : ప్రజల సమస్యలను పరిష్కరించి పారదర్శక పాలన అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బుధవారం నార్కట్‌పల్లి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన చివరి మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇక నుంచి కొనసాగే ప్రత్యేక పాలనలో గ్రామాల్లో విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీటిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మండలంలోని బి వెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టు, ధర్మారెడ్డి కాలువ, పిలాయిపల్లి కాలువ పనులు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. నార్కట్‌పల్లి పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులను త్వరలో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని వివరించారు. సోమవారం మండల కేంద్రంలో, ప్రతి గురువారం గ్రామ స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఉమేష్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, ఎంపీటీసీ, అధికారులు పాల్గొన్నారు.

పదవికే విరమణ.. ప్రజా సేవకు కాదు

ప్రజాప్రతినిధులకు పదవికే విరమణ తప్ప.. ప్రజా సేవకు కాదని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బుధవారం ఎంపీటీసీల వీడ్కోలు సమావేశం ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఎంపీటీసీలను శాలువాలు, మెమొంటోలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేవారే నాయకులుగా ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, బండ సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

గౌడ సంఘం భవనం ప్రారంభం

నార్కట్‌పల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గౌడ సంఘం భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, పట్టణ అధ్యక్షుడు జేరిపోతుల భరత్, సిద్దగోని స్వామి, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, వడ్డెగోని నర్సింహ, ముత్తయ్య, బింగి కొండయ్య, వేముల నర్సింహ, వెంకన్న, బోయపల్లి శ్రీను, విష్ణు, బాలకృష్ణ, శ్రీనివాస్, సత్తయ్య, శ్రవణ్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సేవతోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు

కట్టంగూర్ : ప్రజాసేవతోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు లభిస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ఎంపీటీసీల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పదవీ విరమణ పొందుతున్న ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, ఎంపీటీసీ మాద యాదగిరి తదితరులను ఎమ్మెల్యే పూలమాలలు, శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, సూపరింటెండెంట్ చింతమల్ల చలపతి, ఏపీఓ రాంమోహన్, ఏపీఎం సైదులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కేతేపల్లి: పదవీకాలం ముగిసినా నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ముగియనుండడంతో బుధవారం కేతేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఎంపీపీ పెరుమాళ్ళ శేఖర్, జెడ్పీటీసీ బొప్పనిస్వర్ణలత సురేష్, ఎంపీటీసీలను మండలస్థాయి అధికారులు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పీబీ మాధవి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ భవాని, ఎంపీఓ నాగమణి, అధికారులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పేదింటి ఆడపిల్లలకు వరం

కట్టంగూర్ : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడపిల్లలకు వరంలాంటిదని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 96 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీటీసీలు ఉన్నారు.



కట్టంగూర్ : ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



కేతేపల్లి : ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే వేముల వీరేశం